కుమ్మర్లు కుండమట్టి కోసం తట్టలూ, కావిళ్ళతో చెరువు పరలో గల మట్టి తవ్వి తేవడానికి వెళ్తున్నారు. తట్టలతో మట్టి తెచ్చి ఎవరి గుడిసె ముందు వాళ్ళు కుప్పలుగా పోసుకుంటారు.

వర్షానికి చెరువు పర నీళ్ళతో నిండిపోతే మరి మట్టి దొరకదు. మరోచోట మట్టి కుండలు చెయ్యడానికి పనికిరాదు.

ఇరవై కుటుంబాలకు జీవాధారం ఊరి చుట్టూగల అంత విశాల భూభాగం లోనూ ఆ చెరువు పరను గల ఎకరం జీర మాత్రమే!

మగవాళ్ళ కావిళ్ళలో గునపం, పారా ఉట్టెల్లో గల తట్టలతోపాటు వేలాడుతున్నాయి.

ఆడ వాళ్ళు గుడ్డలు చుట్టగా చుట్టి తలపైన తట్టలు పెట్టుకు నడుస్తున్నారు!

ఊరికి ఆ కుండమట్టి జీర అరమైలు దూరం. అరమైలు దూరం నడుస్తున్న పిల్లలుగన్న తల్లులు, పడుచు పిల్లలతో హాస్యాలాడుతున్నారు.

"హొయ్యారాలు హొలకబోసేకే హోలమ్మీ! హాయిను కురకుర బొతు బరబర — అదెంతోటి కాలం వుండి పోదు."

మరో తల్లి మరీ పరాచికంగా—

"కుండలకు మన్నూ, ఆవం పెట్టడానికి కర్రా కంపా గడ్డీ గాదం. రెండు పంటలు పెరిగేసరికి పెటపెటలు పిగిలిపోయి మిటమిటలు అరిగిపోతాయి."

"కుమ్మర్ల కోడలు పెంట మీదకి రాదేటనంటారు, అందుకే గదే!" అని ఇంకొకరు తేల్చేశారు.

నడుస్తున్న వాళ్ళందరిలోనూ వయసు మళ్ళిన ముసలమ్మ ముందు నడుస్తున్న అమ్మాయితో—

"ఏటే మట్టెమ్మా! కోడి కూతకు నెగిస్తేగాని కుండ పని అవదు గదా! బారెడు పొద్దెక్కాం తరవాతగాని నీ మొగుడు కుండ చెయ్యడం కనిపించదు. కాగలించీను కొని వదలకుంటన్నావేటి?" అంటూ నవ్వింది.

ముందు నడుస్తున్న మట్టెమ్మ సిగ్గులుపోతూ—

"ఎల్లత్తా! నీ కొడుకు సంగతి నీకే తెలాల! నన్నడుగు తావేటి?" అంటూ నవ్వింది.

అది విన్న మరో తల్లి—

"ఈ కాలం పిల్లలు మొగుడ్నే తిరగేసి కొడతారు. మనకి దిక్కేటి? అంతోటి ఆపికాలేం?" అనేసరికి, ఆ మాట విన్న వారందరూ వయసుతో నిమిత్తం లేకుండా కుండలో గులకరాళ్ళు గుల్లించినట్టు నవ్వేరు.


అలా నవ్వుతూ చెరువుకి చేరుకొని అమితమైన ఆశ్చర్యంతో అలా నిలబడిపోయారు!

మట్టి తవ్వి తీయవలసిన గోతులనిండా బ్రహ్మ జెముడు, నాగజెముడు, ముళ్ళ మట్టలూ, కంపలూ నిండి వున్నాయి.

తాత, తండ్రుల నుండి మట్టి తవ్వి తెచ్చుకొని ఆ మట్టిని రకరకాల రూపాలుగా తయారుచేసి, చుట్టుపట్ల గ్రామాలూ సంతలూ తిరిగి తిరిగి అమ్మి బతికిన ఆ కుటుంబాలవాళ్ళు అలా ఆశ్చర్యంగా వుండిపోయి—

"ఏట్నాయినా! ఏటిది?!" అని ఒక ముసలమ్మ అనగా, "ఏటే గోరకలి! ఎప్పుడూ ఎరగంది" అని కొందరన్నారు.

"ఎవులో రగిడీను ముండపాపలు సేసిన పనిలాగు న్నాది" అని వయసు మళ్ళిన మరొకరు సర్దుకోజూడగా ఆమె భర్త భార్యని గదమాయిస్తూ—



"రగిడీసు ముండపాపలు ఊరికి ఇంత దూరం వొచ్చి ఇన్ని మట్టలూ, కంపలూ నరికి తెచ్చి ఈ గోతుల్లోనే ఎందుకేస్తారే? ఇదిగిది మట్టి పిసికిన మన సేతుల్లోకి ముల్లు గుచ్చడానికి సేసిన సన్నాగం నాగున్నాది" అన్నాడు.

అప్పుడు మట్టెమ్మ మొగుడు వీరయ్య కావిడి దించి సారయ్య పెద్దతో—

"కపుర్లా, ఆలోసన్లా ఆ తరవాత! ముందల గోతుల్లోన ముళ్ళమట్టలూ, కంపలూ తీద్దుంగాని. రండి!" అని పనిలోకి దిగాడు.

ఆ మాటకు అంతా కావిళ్ళూ, తట్టలూ దించి పన్లోకి దిగారు! పొద్దు వాలిపోతుండగా వాళ్ళందరూ ఆ పనిచేసి గోతుల్లో మంచి మీదకు వచ్చి—

"మరిప్పుడేటి సేత్తాం? పొద్దుట పొద్దుంగాని! రేత్తిరికి ఈ పని మల్లా సెయ్యకుండా ఎవులైనా కాపలా కాయాల!" అనుకుంటున్నారు.

ఆ మాట అందరికీ బాగుందనిపించి "ఎవులు కాపలా కాస్తారేటి?" అన్నారు.

సారయ్య పెద్ద అందరి మాటలూ విని ఆలోచన చేసి "నా కాలం అయిపోనాది! అడుగో ఈరిగాడు! అడు తగినోడు! ఊరందర మందిసేతా మంచోడనిపించుకున్నాడు. రగిడీసు గుంటల పనే అయితే బుద్ధి సెప్పి రెండు తగిలించి తగిలిగలిగినోడు! అడుంటాడు" అని నిర్ణయించాడు.

వీరయ్య అంగీకరించాడు. మట్టెమ్మ కళ్ళు మిలమిల మెరుస్తూ వీరయ్య వేపు చూశాయి!

మెరుపు కళ్ళ మట్టెమ్మను చూస్తూ వీరయ్య "నానిక్కడే వుంటాను. రేత్రికి గంజొట్టుకోని బేగి రా!" అని చెప్పాడు.

మట్టెమ్మ నవ్వుతూ తలూపింది.

మట్టెమ్మ తలూపడం చూసిన ఈడుపిల్ల మట్టెమ్మ చెవిలో "గుడిసెకంటా చెరువూ ఆ ఎగన రోడ్డూ సేలాలూ కానాలూ ఎన్నెల్లో ఈరన్న ఈలపాటా దుమాదుమా గుంటాదిలే!" అంది.

మట్టెమ్మ మరింత సరాచికంగా—

## గాయం

చెప్పాల్సిందేదో వుంటుంది
నాలోకి నేను తొంగి చూసుకుందామనీ
అనుకుంటాను
నీకు నువ్వూ నాకు నేనూ
కోల్పోయి ఒకర్నొకరం
మొహాలకి చిర్నవ్వు పులుముకొని
జీవితాన్ని అభినయిస్తుంటాం
గొంతు ఆర్చుకుపోతున్నా,
గుక్కెడు కన్నీళ్ళనీ మర్చిపోయి
పొడి మాటల టాటా గుడ్‌బైలతో
నిష్క్రమిస్తాం ఆఖరికి
మనకి ఒక్క జ్ఞాపకమూ మిగలదు
తెగిన వేలి కొనల మీది
బ్లేడు చేసిన నెత్తుటి సంతకమూ
చెరిగిపోతుంది

— రవూఫ్

"ఏంకన్న కనిపించినరికి మన్నూ మశానం సందులూ గొందులూ అయి మాత్తరం బాగోసేటి?" అంది.

ఇద్దరూ నవ్వుకుంటూ ఊరివేపు వెళ్తున్న వాళ్ళ వెనక వెళ్తున్నారు. నవ్వుతూ నడుస్తూ ఊరివేపు వెళ్తున్న మట్టెమ్మను చూస్తున్న వీరయ్యకు మూడు మాసాల కిందట ముచ్చట జ్ఞాపకానికి వచ్చింది.

వసంత రుతువు వెన్నెల నాన! ఆ నానలో మట్టి పిసికి ముద్ద చేసి సారె మీద పెట్టి తిప్పుతున్నాడు!

వెన్నెలలో కర్రపట్టి సారె తిప్పుతున్నపుడు కండలు కదుల్తూ చిరుచెమట పడుతుంది!

మాతి మండి నీళ్ళ కుండ తెస్తున్న మట్టెమ్మ ఎంతసేపట్నుండి చూస్తుందో వీరయ్యకు తెలియదు. వీరయ్య సారె తిప్పి కర్ర వదేసి చక్రం గిరున తిరుగుతుండగా మట్టిని కుండగా రూపుదిద్దడానికి వంగబోగా అతని బుగ్గను రెండు పెదవులు "మచ్" అన్న శబ్దంతో స్పర్శించాయి!

చూస్తే మట్టెమ్మ! వీరన్న ఆశ్చర్యానికి హద్దుల్లేవు. దిమ్మెరపోయి అలా నిలబడిపోయిన వీరయ్యను చూస్తూ పరుగుపెట్టిన ఆనాటి వెన్నెల మట్టెమ్మను వీరయ్య మరచిపోలేకపోయాడు! మట్టెమ్మ మనను తెలుసుకొని—

"ఇందుకా ఇది ఎన్ని మనవులొచ్చినా ఎల్లినాది కాదు. వదలకుండా ఎంటెంట తిరిగినాది! కానుకోలేక పోయాను" అని కనుక్కున్న వీరయ్య మట్టెమ్మను మరి వదల్లేదు.

ఆనాటి తీపి గుర్తు తీపితీపిగా వస్తుండగా దూరాన మట్టెమ్మ వెన్నెల వెలుగులో నయ్యారపునీడలా వస్తుండడం గమనించాడు!

రాత్రంతా వీరయ్య మట్టెమ్మల కాపలాలో చెరువు తెల్లబడింది! చెరువు పక్కగల రోడ్డు కౌగిలింతల సడక గొంతుల్లో వెక్కి ముందుకి ఊగిసలాడింది. రోడ్డు పక్క సేలాలు పరుగులు పెట్టాయి! దూరాన కనబడుతున్న కొండలు తెల్లవారిపోతుందని ఎర్ర రంగును పేసుకున్నాయి! సూర్యుడు చురచురమంటూ మీదికి వస్తున్నాడు.

చురచుర మంటున్న సూర్య కిరణాల్లో నుండి ఇద్దరూ వీథిలోనికి వచ్చి సంతోషంగా—

"మన్ను కెల్లండి! మరేటి నేదు. ఎవులూ రానేదు" అని ఆనందపు కేకలు వేసి గుడిసెలోకి వెళ్ళిపోయారు!

వీరయ్య "కళ్ళు మండిపోతున్నాయి! నునుకు తియ్యనిచ్చినావు కాదు" అని నులక మంచం మీద చేరబడి పోయాడు! ముసిముసి నవ్వుల మట్టెమ్మ "నాకేటి మండిపోయినా సాకిరీ సెయ్యాలగదా?!" అంటూ పొయ్యి రాజెయ్యడానికి వంటపంచలోనికి వెళ్ళిపోయింది.


పొయ్యి మీద అంబలి కుతకుతమని ఉడుకుతున్న శబ్దం! వీథిలో మళ్ళీ గోల! గగ్గోలు!!

"ఒరే ఈరన్నోయ్! గోతులకాడ కర్రల్తోటి కాపలా కాస్తన్నారు. ఓర్నాయినోయ్! ఓరి బాబోయ్? ఏటే గోరకలి!" అరుపులతో ముసలి వెంకమ్మ వెర్రికేకలు వేస్తోంది!

కేకలు విన్న మట్టెమ్మ వీరయ్యను లేపింది. వేసిన కేకల్నే వేస్తున్న వెంకమ్మ కేకల్ని విన్న వీరయ్యకు మొదట ఏం చెయ్యడానికీ తోచక మూలనున్న సారె తిప్పిన కర్ర తీసి చెరువు వేపుగా పరుగుతీశాడు! మట్టెమ్మ పొయ్యి మీద ఉడుకుతున్న అంబల్ని అలాగే వదిలేసి వీరయ్య పరుగును అందుకోలేక అలసిపోతూ అనుసరించింది.

చెరువు దగ్గరకు వెళ్ళిన వీరయ్య తనవాళ్ళను తోసుకుంటూ కాపలాగా వున్న కర్రల మధ్యకు బాణంలా దూసుకుపోయాడు! అది చూసిన మట్టెమ్మ—

"ఓర్నాయినో! నా ఈరిగాడు! ఓలమ్మో నా ఈరిగాడు" అని గుండెలు బాదుకుంటూ ధారగా కన్నీరు కారుస్తూ లబోదిబో మంటోంది!



ఎత్తిన కర్రలు వీరన్నను చూసి దిగిపోయాయి! అంతా ఆ వింత చూస్తుండగా వీరయ్య కర్రలెత్తిన కావలావాళ్ళతో ఏదో మాటాడుతున్నాడు. అలా మాటాడి వీరయ్య తిరిగి తనవారి దగ్గరకు వస్తూ—

"అలందరూ నాతోటి కలిసి సాము నేరుసుకొని సంగిడీలు ఎత్తిన నేస్తాలు! అందుకని నల్లకున్నారు. అలు సెప్పిందేటంటే - అప్పన్న బుగత నేడా ఆడిదట ఈ జాగా! మన్ను తియ్యడానికి వొచ్చిన కుమ్మర్లను అడ్డి మన్నాడట! నీలిగితే నాలుగు తగిలించమనీ, తగునాస్తే తను సూసుకుంటానన్నాడట! ఇదిగీ సంగతి అలు సెప్పినట్టేగ సెప్పొద్దన్నారు! మనమే జంకీసి మన్ను తియ్యడానికి రాలేదని అప్పన్న బుగత దగ్గిట బొంకేస్తా మన్నారు! మనకే ఏదో ఆలోసన సేసుకోమని సెప్పి నారు. నీ తోటి దెబ్బలాడ్డం ఇష్టం లేదురా ఈరన్నా. అది గందుకు మన్నోళ్ళి మీ వోళ్లతోటి ఈ సంగతి సెప్పమన్నారు" అని చెప్పి ఊరుకున్నాడు.

ముసలి వెంకమ్మ "ఏటీ గోర కలి? ఏటీ అన్నేయం? నా నెప్పుడూ సూడ్నేదు" అని ఎగరబోయింది.

ఎగరబోయిన వెంకమ్మను కసురుతూ—

"నదండి. ఊరి పెసిడెంటు బావుకి సెప్పకుందుం గాని! ఉట్టుట్టి కూకలేస్తే ఏటొస్తాది?! నదండి, నదండి" అంటూ సారయ్య పెద్ద అందర్నీ ప్రసిడెంటు దగ్గరకు నడిపించాడు.

ప్రసిడెంటు తన వీధి అరుగు మీద కూచొని వుండగా, అరుగు ముందు కుమ్మరి వీధి ఆడా, మగా అందరూ వినయ విధేయతల్తో నిలబడ్డారు. ప్రసిడెంటు తన నవ్వు నవ్వి అందర్నీ "ఏమిటి?" అన్నట్టు కళ్ళతో ప్రశ్నించి, అవే కళ్ళను మట్టెమ్మ మీద నిలబెట్టి వుంచేశాడు!

సారయ్య పెద్ద అందరి తరపువా మాటాడుతూ చాలా చెప్పి చివరగా—

"తమరికి తెలని సంగతేటున్నాది గనకన! సింవరు తసీలాలొచ్చి సంగోరు సచ్చినాం! ఇష్టీలు దిగిపోనాది! మరేటీ నేదు! ఊపిరే ఉండిపోనాది! ఉన్ని ఊపిరితోటి కసిన్ని గొల్లు గెంజినీళ్లకీ, ఇంత అంబలి దప్పిక్కీ కుండలూ, దాకలూ కావుళ్ళతోటి మోస్తన్నాం! ఊర్లూ సంతలూ తిరిగి సావురాని బతుకు బతకతన్నాం! ఇప్పుడు మరి మట్టి సినర కూడా నేపోతే పిల్లా పాపల్తోటి సచ్చయినా సన్నాల! ఊరైనా నొదిలియ్యాల!" అని చేతులు జోడించి దించేశాడు!

సారయ్య పెద్ద మాటలు ఆగిపోయాయని గమనించిన ప్రసిడెంటు మట్టెమ్మ మీద నుండి కళ్ళను మామూలుగా వుంచుకొని—

"అది పట్టా భూమి అని అప్పన్న బుగత అంటున్నాడు. తాత తండ్రుల నుండీ మట్టి తవ్వుకుంటూ మీరు బతుకుతున్నారని నాకు తెలుసును! హక్కులు ఇరుపక్షాలకీ వున్నాయి! కర్రలు పట్టి అప్పన్న బుగత నిలబడినప్పుడు మీరూ కర్రలతోటే సమాధానం చెప్పండి. తగువు కోర్టులో తేల్తుంది" అనేసి లేచి మేడలోకి వెళ్ళిపోయాడు.

కుమ్మరి వీధికి వీధి నోరు వెళ్ళబెట్టింది. నోరు మాట రాక మగవాళ్ళు వీధి మధ్య పందిరి కింద కూచున్నారు.

## జనంలో ఓ ముఖం

ఊగిపోతుంటుంది సాగిపోతుంటుంది
ఊపిరి ముడతల్లో రేగిపోతుంటుంది
నిట్టూర్పుల వలలో వేగిపోతుంటుంది

అడుగు అడుగులో ఆరాటంతో
అహరహం ఆశానిశ్వాసాలతో
నడచి పోతుంటుంది
కడచి పోతుంటుంది

భుజాల రాపిడిలో సర్దుకుంటుంటుంది
తొడతొక్కిడిలో తప్పుకుపోతుంటుంది
చేయిసాచి స్నేహార్తితో
సలవరిస్తుంటుంది కలవరిస్తుంటుంది

రక్తంలో మరిగే అలజడిలో
జడిగా సుడిగా నడిగా ఉరవడిగా
ముంచేత్తే ఉన్మాదంతో
కరిగిపోతుంటుంది మరిగిపోతుంటుంది
నిశ్శబ్ద ఘోషలు వింటూ
నిర్లిప్త స్వప్నాలు కంటూ
రేపటి నందనాల రస స్పందన విహారాల కోసం
మురిసి పోతుంటుంది
మెరిసి పోతుంటుంది

— కేవిస్వీ

ఆడవాళ్ళు కొందరు గడపల్లో కూచొని మగవాళ్ళు ఏమిటి మాటాడుకుంటారోనని వింటున్నారు.

ఏం చెయ్యడానికీ తోచక గిజగిజలాడుతున్నవాళ్ళను నవ్వించడానికని కురమయ్య "ఇనుకుంటారేటి? నానొక కత సెపతాను" అన్నాడు.

కురమయ్య మాటాడితే చాలా మంది నవ్వుతారు. అతని చేత సోస్యాలాడించడానికి కొందరు కావాలని ప్రయత్నిస్తుంటారు. అలాంటి కురమయ్య కథ చెబుతా ననేసరికి కుమ్మరకారంతా సంతోషంగా చెప్పమన్నారు.

"అయితే ఇనండి మరి" అని కురమయ్య ప్రారంభించాడు.

"ఇప్పుడు సూసినాం గదా! ఇలాసింటి పెసిడెంటే నొకడు మనూర్ల తగువులు మనూర్లే సల్లారి పోవాల, నిరేనోల దగ్గిటకి ఎల్లకూడదు అని ఊరందర మందినీ సలిసి సెప్పినాడట. ఆ మాటకి ఊరందరమందిన్నీ సరదా పడిపోయి మాబాగున్నాదని మల్లా మల్లా పెసిడెంటుని పొగిడేసినారట! పొగిడేసిన మర్నాడే పెసిడెంటుని దగ్గిటకి కాలిరిగిపోనాదని గాడిద నొటుకొని నొకడూ-సెయ్యిరిగి పోనాదని సెల్లాన్నెట్టుకోని ఇంకొకడూ వొచ్చినారట.

పెసిడెంటుగోరు ఇద్దరు సెప్పిన కతా ఇన్నారట! ఇని ఇచ్చినాడ్రా బావూ తీరువు! అది తీరువు కాదనుకో.

గాడిద కాలిరగ్గొట్టినోడికి గాడిద కాలు బాగయినంత దాకా వుంచుకొని మేపి అప్పజెప్పమన్నాడు. సెయ్యిరి సినందుకు ఆ ఇరిగిన సెయ్యి బాగైనంతదాకా ఆడ మనిసి మంచుకోని సెయ్యి బాగుసేసిన తరవాత తిన్నగ తీసికెల్లి నొప్పసెప్పిరమ్మన్నాడట. అలాగ తీరువు తీరిస్సి ఇందాక మన పెసిడెంటుగోరు నెగిసెలిపోయినట్టేగ ఎలి పోనాడట. అలాగుంటాయ్రా పెసిడెంటుల తీరువులు" అని చెప్పేసరికి వీధి వీధంతా అన్ని కష్టాలూ ఆ నిముషంలో మరిచిపోయి సకసకమని నవ్వి నవ్వలేక అలిసిపోయి ఆగిపోయారు.

అందరూ అలా ఆగిన తరవాత సారయ్య పెద్ద లేచి "మరేటి సేత్తాం? కుమ్మర్లం. ఏ కోరుట్లు తిరగతాం? కొట్టుకోని సచ్చింతరవాత ఏ పేదరు బావులికి ఎంత సోస్తాం? కూటికే టికానా లేనోలం! కోరుట్లు మెట్టూరా తిరిగి సన్నాల! మన్ను బతుకుల్లో బుగ్గి పడిపోతన్నాది! నెగండి" అని లేచిపోబోయాడు. లేచి పోబోతున్న సారయ్య పెద్దను వీరయ్య ఆపాడు.

"రేపు మన్ను తెల్దుంగాని మన కూట్లోన బుగ్గి పడిపోతే ఆ మన్ను గోతుల్లోనే బుక్కెడేసి రగతాలు కక్కేసి ఆ మన్ను లోనే కలిసిపోదుంగాని. అలాగ కలిసిపోడానికి ఎవులు ఇష్టపడకపోయినా నాను మాత్రం అలాగే సేత్తాను" అని లేచి వెలిపోయాడు.

అందరూ నిశ్శబ్దంగా ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళి పోయారు. మట్టెమ్మ గుండె దడదడలాడగా ఇంటి లోనికి వెలిపోయిన వీరయ్యను చూస్తూ గడపలోనే కూచుండిపోయింది.

దిక్కుతోచక దిగులుగా కూచున్న మట్టెమ్మ దగ్గరకు పెద్దవారిళ్ళలో పని చేస్తున్న నాగులమ్మ వచ్చి "కొత్త కుండ దొరకుతాదేటే మట్టెమ్మా" అని అడిగింది.



ఎప్పుడూ రాని నాగులమ్మ కుండకోసం కుమ్మరి వీధి రావడం మట్టెమ్మను మరింత ఆశ్చర్యంలో ముంచింది.

నాగులమ్మ అలా అడిగి మట్టెమ్మ పక్కన కూచుంది మెల్లగా

"రగతాలు కారకుండా సెయ్యడం నీసేతిలోన వున్నాది" అంది.

మట్టెమ్మ మరింత ఆశ్చర్యపోయింది! ఆశ్చర్యంలో వుండిపోయిన మట్టెమ్మ చెవిలో చాలాసేపు గుసగుస లాడింది. చాలాసేపు గుసగుసలాడి ఎదరగా వున్న కొత్తకుండ తీసుకొని వెళిపోయింది!

రాత్రి వెన్నెల్లో చుక్కలు కలిసిపోయిన కాంతి. ఉండి ఉడిగీ ఊరకుక్కల అరుపులు.

వీరన్న నులకమంచం మీద నిద్రపట్టక దొర్లు తున్నాడు. మట్టెమ్మ మంచానికి ఎడంగా నేలను గుడ్డలు పరుచుకొని పడుకుంది.

ఎప్పుడూ నిద్ర రాలేదన్న బాధలేని వీరయ్యకు నిద్ర రాకుండా ఇటూ అటూ ఒత్తిగిలి చిరాకుపడుతున్నాడు. గలగలా నవ్వుతూ మాటాడకుండా నిద్రపోని మట్టెమ్మ మాటాడకుండా ముడుచుకొని పడుకుంది!

దూరాన కుక్క ఒకటి అరవగా మరి మూడు నాలుగు కుక్కలు అరుపులు అందుకున్నాయి. కాసేపు కుక్కలు అరుపులు విని అవి ఆగిపోయిన తరువాత పోటు రాత్రి విన్న శబ్దం లాగే వుంది. మట్టి పెళ్ల పెళ్లలుగా జారి పడుతుంది.

మట్టెమ్మ జారి పడుతున్న మట్టి పెళ్లలు తట్టలోనికి ఎత్తకుండా వీరయ్యను చూస్తూ అలా నిలబడిపోయింది. అదేమీ గమనించని వీరయ్య పొడిచిన మట్టినంతటిని మూడు తట్టల్లోనికి ఎత్తి మట్టెమ్మతో "ఏటేయాం ఈ జాగాలో రగతం కారరాదనుకున్నాను! ఏటైనాదో గానీ వీరయ్యకు నిద్ర మగతగా వచ్చింది.

ఆ మగత నిద్రలో అతనికి తడి మట్టిలో గునపంతో పొడిచినట్టుగా వినిపిస్తుంది. అలా కలగా ఆ శబ్దం వినిపి స్తుండగా గునపంతో పొడిచిన మట్టి పెళ్ళలు తట్టల్లోనికి ఎత్తుకొని కేరింతలుగా వెళ్తున్న ఆడవాళ్ళు కనిపించారు. బారులుగా తిరినడుస్తున్న మట్టి తట్టలు తరగకుండా అనంతంగా వెళ్తున్నాయి. వీరయ్య కలత నిద్రలోనే "మట్టి" అని కేకవేశాడు.

## చిన్నారి దీపమా!

చిరునవ్వుల పాపా
చిన్నారి దీపమా!
పాల వెన్నెల పాపా,
పాపాల చీకటి పోకని రూపా!
నవ్వాల పాపా, నవ్వాలి
నవ్వులో వెల్గులను రువ్వాలి!
ఇంటి నిండా దీపాలు
దీపాలకు దీపానివి నువ్వే!
నీ మాటలు మమ్మల్ని
అలరించే పాటలు
నువ్వింట్లో వుంటే నిండుగ
అదే మాకు పెను పండుగ

— కొడిమెల శ్రీరామమూర్తి

మట్టెమ్మ అప్పుడే పెరటి తలుపు తడక తోసుకొని వీరయ్య పిలుపు విని ఉలిక్కిపడింది. వీరయ్య అప్పుండి ఇటు ఒత్తిగిలి గురకకొడుతున్నాడు. మట్టెమ్మ ఆ పిలుపు నిద్ర కలవరింతగా తెలుసుకొని వీరయ్య ముఖం చూస్తూ అలా వుండిపోయింది.

మరి కొంచెం సేపటికి కోడి కూసింది. ఇంకొంచెం సేపు తరవాత కాకులు అరుస్తున్నాయి.

వీరయ్య నిద్రలేచి కావిడికి తగిలించవలసిన గునపం పారతోపాటు పారె తిప్పిన కర్ర కాకుండా సాము చేసిన కర్ర పట్టుకున్నాడు.

నిశ్చలంగా నడుస్తున్న వీరయ్య వెనక మట్టెమ్మ నిశ్శబ్దంగా అనుసరించి వెళ్ళింది. ఇద్దరూ చెరువు దగ్గరకు వెళ్ళేసరికి తెల్లగా తెల్లారిపోయి ఎండ పొడ కడుతూ వుంది.

వీరయ్య గునపం తీసి మట్టిలోనికి పొడిచాడు. రాత్రి విన్న శబ్దం.

వీరయ్య మట్టిలోనికి పొడుస్తూనే వున్నాడు. గునపం ఏటీ జరగలేదు! ఎవులూ అడ్డలేదు! మనోలికి ఇకన మట్టికి కరువేలేదు" అంటూ రెండు తట్టలు కావిడిలో వుంచి మట్టెమ్మతో తట్ట ఎత్తుకోమని చెప్పి అమితమైన ఉత్సాహంతో వీధికి వచ్చాడు.

మట్టితో వచ్చిన వీరయ్యను ఆశ్చర్యంగా చూస్తున్న వీధివాళ్ళు "ఏట్రా! ఈరన్నా! ఏటైనాది?" అని అడిగారు.

"ఏటీ అవలేదు. మరేటీ అనరు ఎల్లండి ఎంతోటి కావలసినోలు అంతోటి తెచ్చుకొండి" అనేసి తెచ్చిన మట్టిని ఇంటిముందు కుప్పగా పోశాడు.

మట్టెమ్మ తల మీద తట్టను దించేసి నిలబడి పోయింది. వీధి వీధంతా కేరింతలుగా మట్టి కోసం పరుగులు తీశారు.

రాత్రి వెన్నెల మామూలుగా వెలుగుతుంది. వీధి వారంతా ఉత్సాహంగా కబుర్లు చెప్పుకుంటున్నారు. మట్టెమ్మ మాత్రం మాటాడకుండా గండరించిన శిలా ప్రతిమలా వుండిపోయింది.

వీరయ్య గత రాత్రి గురించి చెబుతూ నిద్రలోకి జారిపోయాడు.

తెల్లవారింది!

వీధిలో మళ్ళీ గుసగుసలు! మట్టెమ్మ లేని కుమ్మరి వీధిలో పుకార్ల మీద పుకార్లు. కుమ్మరి కురమయ్య మాటలు వీరయ్యకు వినిపించాయి.

"సోన్రా! మనోళ్లు మట్టోసినా సెమటోసినా గదా! సబ్బులూ సెంటులూ ఆ సోన అది గది ఎంతోటి పనైనా సేత్తాది. డబ్బుల మాయనోల్ల మన ఆడగుంటలి కేస్తున్న రంగులనోల! మన పెల్లాలు అప్పసెల్లిల్లా మనకి దక్కనీకుండా పన్నిన రంగుల మాయనోలరా" అంటు న్నాడు.

ఆ మాటలు విన్న పోరయ్య పెద్ద కురమయ్యను కసురుతూ

"సోన తెలిసోయిన గుంట కాదురా అది! రగతాలు కారకుండా సేసీగందనుకోని మనోలందరనందికీ బతుకుదారి దొరకుతాది గావాలనీనుకోని అది గలాసింటి దారి తొక్కేసింది! మట్టెమ్మ!

"అది దేవత! దేవతలూ దేవుల్లా ఏటిసేసి మనకే టిచ్చినా అది దక్కనియ్యని మాయ దెయ్యాలున్నాయి! దెయ్యాల రాజ్జెంలో దేవుతలు కాలిపోతారుగానీ బతుకు నిలబెట్టలేరు. మట్టెమ్మ తల్లి దేవత! ఎటుకాసెలిపోయి ఏటైపోనాదో?" అంటూ కంటనీరు కార్చాడు.

ఆ మాటలన్నీ విన్న వీరయ్య మంచం మీద నుండి మరి లేవలేదు!

మరి మూడు మాసాలు గడిచిపోయింది. వర్షాలు వెనకపెట్టాయి. మట్టి కోసం వెళ్ళినవాళ్ళు మట్టి తీసుకు రాకుండానే తిరిగి వచ్చారు.

ఆ భూమి పట్టా అయిపోయింది.

తగువులు పడ్డారు. తన్నుకున్నారు. రగతాలు కారి పోయాయి. కోర్టులెక్కారు. లోన్లు దొరుకుతాయంటే ఆఫీసుల చుట్టూ తిరిగారు. దొరికిన డబ్బులు దళార్లు ఖర్చు పెట్టించేశారు.

ఇప్పుడు కుమ్మర్లు కూలివాళ్ళుగా మారిపోయి వెళి పోతున్నారు.

